# మగపురుషుడు - ఆడస్త్రీ

పాలగుమ్మి పద్మరాజు

అసలు ప్రొఫెసర్ రామగోపాల్‌కి, ఆ చిన్న కాలేజీలో రసాయనశాస్త్రం బోధించే పనంటేనే తలనొప్పి. బొత్తిగా రంగూ రుచీ లేని అధ్యాపక పదవిమీద అయిష్టతేకాదు ఏవగింపుకూడాను, అతనికి. అతడు వొద్దన్నా, అతని శిష్యులూ, సహాధ్యాపకులూకూడ అతన్ని ప్రొఫెసర్ అని పిలుస్తుంటారు. ప్రొఫెసర్ అన్న పదం వినగానే అతనికి కాలేజీ ఆవరణలో ఉన్న నల్లరాతి విగ్రహం గుర్తుకొస్తుంది. ఏ కోశానా మానవత్వంలేని గంభీరమైన రేఖలతో, గడ్డకట్టుకుపోయిన జ్ఞానభాండారానికి చిహ్నంగా నిలబడి ఉంది ఆ విగ్రహం, అతని దృష్టిలో. రామగోపాల్ చలాకీ అయినవాడు. అతని చలాకీతనం ఒకప్పుడు సహజంగా కనిపిస్తుంది, మరొకప్పుడు నటనలా కనిపిస్తుంది. సహజత్వంనించి నటనలోకి మార్పు అనుకోకండా వస్తుంటుంది, చటుక్కుని. అంచేత నటనకూడా అతనికి సహజమే ననుకుంటారు ఎరుగున్నవాళ్లు. సాటి మగవాళ్ళమధ్య ఉన్నప్పుడు అతనికి పట్టపగ్గా లుండవు. విరగబడి ప్రవర్తిస్తాడు. నచ్చిన తినుబండార ముంటే పక్కవాడి ప్లేటులోంచి తీసుకు తినేస్తాడు. ఎరమరికలు లేకండా కొత్తవాళ్ళతో అయినా పరాచకా లాడతాడు. తనమీద తనే ఛలోక్తులు విసురుకుని ఆనందిస్తాడు. ఆడవాళ్ళ వాసన తగిలితేమాత్రం అతి నాగరకుడై పోతాడు. కాలూ చెయ్యీ కదపడం దగ్గర్నించి, మాటా గొంతూ వరకూ, అన్నీ బిగుసుకుపోయినట్టు పని చేస్తాయి. ప్రతిమాటా క్షమార్పణలతో ప్రారంభిస్తాడు. రాని చిరునవ్వు తెచ్చిపెట్టుకుంటాడు. తన గాభరా కప్పిపుచ్చుకోడానికి, లేని ఉత్సాహం నటిస్తాడు. ఆడవాళ్ళ మెదడుమీద తనకంతగా గురిలేదని, అతిమర్యాదగా అపహాసిస్తాడు. అయినా అతడంటే, సామాన్యంగా ఆడవాళ్ళందరికీ సరదాయే. అతి సాహసంగా అతడు వెలిబుచ్చే అభిప్రాయాలు ఎంత భయంకరమైనవైనా, అతను ఊరికే సరదాకోసం అంటున్నాడేగాని, అవన్నీ అతనివి కావని ఆడవాళ్ళ నమ్మకం. అతని విపరీతాభిప్రాయాలు కాలేజీ అధికారులవరకూ పాకినా, వారుకూడా అంతగా పట్టించుకోలేదు. మొరిగేకుక్క సామాన్యంగా కరవదని బహుశా వాళ్ళుకూడా ఉపేక్షించి ఉంటారు.

రామగోపాల్ పలుకుబడికి ఒక ముఖ్య కారణం ఉంది. అతని వయస్సు ఇరవై అయిదు; అతనికింకా పెళ్ళికాలేదు. అతనికి మామగార్లు కావడానికి ఆడబిడ్డల తండ్రులు ఎన్ని ప్రయత్నాలన్నా చేశారు. ఈ దేశంలో ఇరవై దాటిన యువకుడెవడూ సామాన్యంగా బ్రహ్మచారిత్వాన్ని నిలబెట్టుకోలేడన్న సాధారణ సిద్ధాంతాన్ని, రామగోపాల్ పూర్వపక్షం చేశాడు.

అంచేత, రామగోపాల్ని అకస్మాత్తుగా కాలేజీనించి బహిష్కరించడానికి దారితీసిన సంఘటనలు అందరికీ ఆశ్చర్యం గొలిపాయి - రామగోపాల్కికూడా.

ఒకనాడు రసాయన సంయోగాన్ని గురించి అతను ఉపన్యసిస్తుండగా, ఆ కళ్లు మొదటిసారిగా అతన్ని తికమక పెట్టాయి. పరస్పర విరుద్ధమైన రెండు శక్తులమధ్య ప్రకృతిసహజంగా బలవత్తరమైన ఆకర్షణ ఉండడం విషయమై, అతను మహోత్సాహంగా ఉపన్యసిస్తున్నాడు. ప్రకృతిలోంచి ఎన్నో ఉదాహరణలు ఎత్తిచూపాడు. అకస్మాత్తుగా అతని ధోరణి ఆగిపోయింది. క్షణంసేపు తను ఏ విషయమై మాట్లాడుతున్నాడోకూడా మరిచిపోయాడు. ఆ కళ్లు అతని కళ్ళల్లోకి తదేకంగా చూశాయి. అతన్ని దూసుకుపోయి, అతని వెనకాల ఎక్కడో కేంద్రీకరించినట్టు. అతనికి చిరాకు పుట్టుకొచ్చింది. ఆ కళ్ళ యజమాని వేపు ఒక ప్రశ్న విసిరాడు.

'ఇప్పుడు నేను ఏ విషయంచెప్పాను?'

అమ్మాయి లేచి నిలబడింది. తలవంచుకుని అంది,

"క్షమించండి, నేను వినలేను."

వంచిన కళ్ళలో కొంచెం తడి రామగోపాల్‌కి చూచాయగా కనిపించింది. నిండు క్లాసులో జరిగిన ఈ అవమానానికి అమ్మాయి కంట తడిపెట్టడం సహజమే. ఆ ప్రశ్న ఎందుకడిగానా అని పశ్చాత్తాప పడ్డాడు రామగోపాల్. ఆ గంటసేపు ఏదోవిధంగా పాఠం నడిపించాడు. అయితే అతని సహజధోరణి ఆ రోజుని మళ్ళీ అతనికి రాలేదు.

ఆ గంట అయిపోయాకకూడా చాలాసేపటివరకూ, ఆ కళ్ళు అతన్ని వెన్నాడుతూనే ఉన్నాయి. అతని శిష్యుల ముఖాలు అతనికి గుర్తున్నా, సామాన్యంగా వాళ్ళ



పేర్లు గుర్తుండవు. అంచేత ప్రాక్టికల్ క్లాసులో అటెండెన్సు వేసేటప్పుడు ఆ అమ్మాయి పేరు ప్రత్యేకంగా గుర్తుంచుకున్నాడు. ఆమె పేరు, రాధ. ఆ క్లాసు అవుతున్న రెండు గంటలూ ఆమెను పరీక్షగా చూస్తూనే ఉన్నాడు రామగోపాల్. ఆమె అతి చాకచక్యంగా పరిశుభ్రంగా పనిచేస్తుంటే మనసులో మెచ్చుకున్నాడు. ఆమె తన నోటు పుస్తకం పట్టుకుని అతని దగ్గరకు వచ్చినప్పుడు యాదాలాపంగా అన్నాడు.

"మీ ఆడపిల్లలు రికార్డులూ అవీ బాగానే రాస్తారు. అయితే అసలీ సైన్సు గ్రూపు లెందుకు పుచ్చుకుంటారో నాకర్థంకాదు. సైన్సు చదవాలంటే మెదడులో మగతన ముండాలి."

"సార్! సైన్సులో ప్రఖ్యాతిగడించిన ఆడవాళ్ళుమట్టుకు లేరాండి? మాడామ్ క్యూరీలాంటివాళ్ళు," అందామె. రామగోపాల్ నవ్వుతూ అన్నాడు.

"ఆమె అంత ఆడదికాదు'."

అనుకోకుండా రాధ, ''అయ్యో!'' అని అరవడంతో ఆ సంభాషణ ఆగిపోయింది, రామగోపాల్ కిందికి చూశాడు. అతని కొత్తపాంటు మడత నిండా సిరా ముద్దగా పడింది. అతని కాలిదగ్గర పగిలిపోయిన రాధ పెన్నుంది. రాధ ఎంతో నొచ్చుకుంది. తన తెలివి తక్కువకి విచారాన్ని వెలిబుచ్చింది. రామగోపాల్ ఫరవాలేదని, ఎంత తేలికగా అన్నా, అతని మనస్సుని ఒక సందేహంమాత్రం గట్టిగా పట్టుకుంది - రాధ చేతిలోంచి పెన్ను దానంతటదే పడిపోలేదని.

ఆ తరువాత రకరకాల చిన్నసంఘటనలు రామగోపాల్ అనుమానాన్ని మరింత బలపరిచాయి. అయితే తన మనస్సులో అనుమానాలు నిజమని రుజువు చెయ్యడానికి తగినంత సాక్ష్యంమాత్రం అతనికి దొరకలేదు. స్థూలంగా చూస్తే అవన్నీ అమాయకంగానే కనబడతాయి. ఆమె హావభావాల్లోనూ, కళ్ళల్లోనూ, చెక్కిళ్లలోనూ, అతనితో మాట్లాడుతున్నప్పుడు ఆమె గొంతులో మోగే వింత శ్రుతుల్లోనూ అంత అమాయకం కానిదేదో అతనికి స్ఫురించేది. లేబరేటరీ బల్లల మధ్య చిన్న సందుల్లో, అనుకోకండా తగిలినట్టు ఆమె శరీరం అతనికి తగిలేది, కావాలని అతను ఒదిగి వెళ్ళినాసరే. అప్పుడప్పుడు అర్థంలేని చిలిపిసందేహాలు తీర్చుమని అతనిదగ్గర కొస్తుండేది. రికార్డు పుస్తకం అతని చేతుల్లోంచి తీసుకునేటప్పుడు, అవసరం లేకపోయినా ఆమె వేళ్ళు అతని వేళ్ళకు తగిలేవి. తన గుండె నిబ్బరాన్నిగురించి రామగోపాల్ కి ఎంత నమ్మకమున్నా, ఈ చిన్న విషయాలు అతన్ని ఆరాటపెట్టడం మానలేదు. ఆమె ఎదట ఉన్నా లేకపోయినా, ఆమె ఆలోచనలు నిత్యం అతన్ని ఆవరించేవి. ఆమె ఆడుతున్న నాటకం అంతా తను చూసి ఆనందిస్తున్నట్టు తన్ను తాను సమర్థించుకునేవాడు.

దసరాశలవల్లో కొందరు విద్యార్థుల్ని తీసుకుని అతను పాపికొండలకు ఎక్స్ కర్షన్ వెళ్లాడు. అందులో రాధకూడా ఉంది. అతని అనుమానాలు వట్టి అనుమానాలే కాదని అక్కడ జరిగిన ఒక సంఘటనవల్ల అతనికి రుజువైంది. అతను మగ విద్యార్థులతో కలిసి గోదావరిలో స్నానం చేస్తున్నాడు. ఆడపిల్లలంతా నీటిమీదికి వంగి ఉన్న ఒక కొండకొమ్ముమీద కూర్చుని చూస్తున్నారు. చటుక్కుని అతనికి 'కెవ్వు' మని ఒక కేక, 'దభీ' మని శబ్దం వినిపించాయి. అతడు తిరిగి చూశాడు, అతనికి నాలుగయిదు గజాల దూరంలో ఒక ఆడపిల్ల మునుగుతూ తేలుతూ నీటిలో కొట్టుకుంటోంది. రెండుబారల్లో ఆమె నందుకుని తల పైకెత్తాడు. ఆమె రాధ. ఆమెకు స్పృహ లేదు. తన భుజంమీద ఎత్తుకుని ఆమెను గట్టుకి చేర్చాడు. గట్టు ఎక్కుతుండగా ఆమె ఎడంచెయ్యి అతని మెడను చుట్టుకుంది. ఆ చుట్టుకోడం స్పృహలేని స్థితిలో చుట్టుకున్నట్టు లేదు. ఆమె మెలకువగానే ఉందని అతనికి రూఢిగా తెలుసు, రుజువు చెయ్యలేకపోయినా.

ఆఖరుఘట్టం ఒకరాత్రి చీకటిలో జరిగింది. ఆరోజు కాలేజీలో ఏదో సభ జరిగింది. సభ ముగిశాక ఆడపిల్లలూ, అతిథులూ అంతా వెళ్ళిపోయాక, బంట్రోతులికి చెయ్యవలసిన పను లేవో పురమాయించి అతను ఇంటికి బయలుదేరాడు. కాలేజీనుంచి రోడ్డు చేరుకోడానికి అడ్డదారొకటుంది - ఒక పెద్ద మామిడితోపు మధ్యనించి. కారుచీకటిగా ఉన్నా అలవాటైన దారిగనక రామగోపాల్ కాలిబాటను పట్టుకుని నడుస్తున్నాడు. చటుక్కుని మెత్తని శరీరం ఒకటి ఆపాదమస్తకం అతనికి తగిలింది. నడక వేగంవల్ల ఆ తాకిడికి తబ్బిబ్బైకిందపడబోయి ఆపుకున్నాడు.

''చీకట్లో కనబడలేదు మేస్టారూ,'' అన్న రాధ గొంతు అతన్ని ఆరాటపెట్టింది.

అతని మెదడు వేడెక్కిపోయింది. పరస్పర సంబంధంలేని ఊహాలు ఎన్నో అతని మనస్సును ఉప్పెనగా ముంచెత్తాయి. నిర్మానుష్యమైన ఆ అడ్డదారిలో రాధ-ఆడవాళ్ళంతా, అతిధులంతా వెళ్ళిపోయాక-ఆ పైని రాధ ఇంటికి ఇది దారే కాదు. ఇక్కడెందుకుంది? ఎందుకూ? రామగోపాల్ కి ఆ సమయంలో తనేం చేస్తున్నాడో తెలియదు. గుడ్డి ఉద్రేకంలో రాధని గట్టిగా గుండెలకు అదుముకున్నాడు. రాధ తోట మారుమోగేటట్టు పెద్దగా అరిచింది. ఎక్కణ్ణించో ఒక బాటరీ లైటు వాళ్ళిద్దరిమీదా పడింది. అతను జావలా అయిపోయాడు. అతని చేతులు పట్టువిప్పి రాధ నొదిలేశాయి. రాధ పరుగెత్తుకుని ఏడుస్తూ బాటరీ లైటువైపు పరుగెత్తడం అతనికి గుర్తుంది. అతని నుదుటిమీద చల్లని చెమటలు పుట్టాయి. ఆ తరవాత జరిగిన అల్లకల్లోలంలో అతనికి ఎవరూ గుర్తులేదు. ఏమీ గుర్తు లేదు.

మరునాడు ప్రిన్సిపాల్ కబురంపితే వెళ్ళాడు రామగోపాల్. ప్రిన్సిపాల్ కొంచెం క్లిష్టమైన విషయం చెప్పవలసివస్తే, అసలు పదాలు వొదిలేస్తుంటాడు. ఎంతకీ పూర్తికాని వాక్యాలు వింటుంటే చిరాకు పుట్టుకొస్తుంది.

''చూడండి, చాలా-విచారకరమైన... మీ విషయం మేం చాలా....విచారకరమైన....విషయం ఏమిటంటే .... విచారకరమైన....''

రామగోపాల్ ఆరవసారి 'విచారకరమైన' వినబడ్డాక ఇంక తట్టుకోలేక కొంచెం తీవ్రంగా అన్నాడు,

''విషయం ఎంత విచారకరమైనదైనా, నా అభిప్రాయాలు అంత విచారకరమైనవి కావని మనవి చేస్తున్నాను.''

''అబ్బెబ్బే! ఆ విషయంలో....మాకు- చర్చించడానికి...విచారకరమైన విషయం ఏమంటే.. మేము- ఈ సందర్భంలో అనేక కోణాలనుంచి విచారించి....''

ప్రిన్సిపాల్ వాక్యం పూర్తిచెయ్యకుండానే రామగోపాల్ తన రాజీనామాను ఆయనకు అందజేసి వెళ్ళిపోయాడు. ఒక్కసారి అసలు విషయం బైటికి కక్కిన తరవాత, ఇంక ఈ సంఘటన యొక్క నీతి విషయమై రామగోపాల్ ని హెచ్చరించడానికి ప్రిన్సిపాల్ పెద్ద ఉపన్యాసం సిద్ధం చేసుకున్నాడు. రామగోపాల్ రాజీనామా ఉత్తరంవల్లనైనాక ఆయనకా అవకాశం పోయింది.

కాలేజీకి తిలోదకాలొదిలాక, రామగోపాల్ మరొక కాలేజీలో ఉద్యోగం కోసం ప్రయత్నించలేదు. ఈ కథ ప్రతి చోటికీ పాకిపోతుంది. ఉద్యోగానికి వెళ్ళిన చోటల్లా దీని విషయమై సముజాయిషీ చెప్పుకోవలసిన స్థితి పడుతుంది. అతను ఏం చెప్పినా ఎవరి అనుమానాలు వాళ్ళకుంటాయి. ఇల్లాంటి విషయాల్లో సానుభూతి సహజంగా ఆడపిల్లమీదుంటుంది. ఒక చిన్నపిల్ల పన్నిన ఉచ్చులో పడిపోయి ఆమె చేతుల్లో అపజయాన్ని ఒప్పుకోడం అతని కిష్టంలేదు. తాను ఏదో ఒకటి చేసి ఈ లోకాన్ని - ముఖ్యంగా ఆడవాళ్ళ లోకాన్నీ - జయించాలని నిశ్చయించుకున్నాడు. తన ఆశయానికి పెళ్ళి అడ్డొస్తుందిగనక, తనకు పెళ్ళే వద్దనుకున్నాడు. స్త్రీ మనస్తత్వాన్నిగురించి వైజ్ఞానిక గ్రంథాలు తెప్పించి చదవడం ప్రారంభించాడు. ఆ తరవాత ఆ విషయమై అధికారంతో వ్యాసాలు వ్రాయడం మొదలుపెట్టాడు; కథలు వ్రాయడం మొదలుపెట్టాడు.

స్త్రీ పురుష ప్రకృతుల విషయంలో అతనికన్నా తెలిసినవారెవరూ లేరని దేశంలో ప్రఖ్యాతి గడించాడు రామగోపాల్. స్త్రీ మనస్సు లోతులు కొలవడంలో అతనికన్న ఘటికులు లేరన్నారు. వందలాది స్త్రీ పురుషులు రకరకాల సమస్యల్ని పట్టుకుని పరిష్కారంకోసం అతనిదగ్గరకు రావడం మొదలుపెట్టారు. అతని రచనలలో ముఖ్యంగా ప్రజల్ని ఆకర్షించింది, ఆడవాళ్ళయెడల అతను చూపే చులకనా, సానుభూతీ కలిసిన ఒక చిత్రమైన దృక్పథం. నాగరక సమాజంలో స్త్రీ మనస్సు ఎన్ని వింత వింత మార్గాల్లో ప్రయాణం చేస్తుందో, పైకి కనబడే చమత్కారాలకు అడుగున ఎటువంటి అనాగరక చిత్తవృత్తులు ఆమెలో అగ్నిపర్వతాల్లాగ రగులుతుంటాయో, అతనికన్న స్పష్టంగా, అతనికన్న చమత్కారంగా చెప్పినవాళ్లెవరూ లేరు.

నాగరక సమాజంలో, సంస్కారుల ఇళ్ళల్లో, మేధావుల సభలలో, కవి గాయకుల కూటాల్లో, క్లబ్బుల్లో, అతనికున్న పలుకుబడి, అతనికున్న గౌరవం మరెవ్వరికీ లేవు. ముఖ్యంగా నాగరక స్త్రీలందరికీ అతను ఆరాధ్యుడు. ప్రతిదినం ఏ జమీందారిణో, ఏ స్త్రీ సమాజ కార్యదర్శో, ఏ మంత్రిగారి భార్యో అతడ్ని విందుకి పిలుస్తుంది. అందులో కొందరు సిగ్గువిడిచి అతడ్ని పట్టుకునే వేళ్లాడుతుంటారు. పైకి మర్యాద నటిం



చినా, లోలోపల వాళ్ళని ఈసడించుకుని స్త్రీ జాతిమీద తనకున్న కసి తీర్చుకుంటుంటాడు రామగోపాల్. ఇన్నాళ్ళకు తను అనుకున్నది సాధించానని గర్వపడుతుంటాడు.

అతని రచనలు గౌరవంతోపాటు అతనికి ధనం ఆర్జించిపెట్టాయి. ఏరకమైన అసంతృప్తీ ఎరక్కుండా, తనకీర్తి ప్రభలు తరక్కుండా అతను వృద్ధాప్యంలో అడుగుపెట్టాడు.

అతని జీవితంలో ప్రధాన సూత్రం - స్త్రీ పురుషుల మధ్య నిత్యం జరుగుతుండే ఘర్షణలో, విచిత్రమైన ఆయుధాలతో జరిగే యుద్ధంలో, సామాన్యంగా మగవాడు ఓడిపోతుంటాడు. పాతికేళ్లు దాటి సంసార యాత్రలో అడుగుపెట్టే ప్రతి వ్యక్తీ తన మగతనాన్ని మగువల బానిసత్వానికి గురి చేస్తున్నాడు. తను ఒక్కడే మగువల మనస్తత్వాలు గ్రహించేవాడు గనక వాళ్ళ ఆయుధాలకు లొంగకుండా తన మగతనాన్ని నిలబెట్టుకున్నాడు. అంతేకాదు. తన దగ్గరగా వచ్చిన ఆడవాళ్ళని నిరాయుధుల్ని చేసి పారెయ్యగల శక్తి సంపాదించాడు. తను ఏమాత్రం కనుసన్న చేసినా తనకి సంతోషంగా దాస్యం చెయ్యడానికి ఎంతో మంది స్త్రీలు సిద్ధంగా ఉన్నారు. ఆడదానిమీద అతను అంతిమ విజయం సాధించాడు.

ఒకనాడు క్లబ్బులో కూర్చుని కలెక్టర్ సతీమణితో కబుర్లు చెప్పుతుండగా, ఒక పెద్దమనిషి వచ్చి తనంతట తను పరిచయం చేసుకున్నాడు. తను సబ్ జడ్జి ననీ, ఆ రోజే ఆ ఊళ్ళో చార్జి తీసుకున్నాననీ చెప్పాడు. అతను వచ్చిన దగ్గర్నించీ మరెవ్వరికీ మాట్లాడ్డానికి అవకాశం దొరక లేదు. అతనికి రామగోపాల్ వయస్సు వుంటుంది. అతినాగరికసమాజంలో మసలే నియమావళి అతనికి తెలియకపోయినా, మనిషి మాత్రం తెలివైనవాడు కాడు. అతని అతి వాగుడుకి వెనక అమాయకత్వమూ ఉంది, హుందా ఉంది. లావుగా కుర్చీకి సరిపడా కూర్చున్న అతనిలో, అంతలావు హృదయమూ ఉందని రామగోపాల్ కి తెలిసిపోయింది. తనకూ రామగోపాల్ కూ మధ్య ఏకాంతం భగ్నమయినందుకు కలెక్టర్ సతీమణి కొంచెం ముఖం ముడుచుకుంది. రామగోపాల్ గ్రహించాడు. కాని సబ్ జడ్జి మాత్రం అది గుర్తించనేలేదు. పైగా అతను తన భార్య విషయం ప్రస్తావించడం మొదలు పెట్టాడు. నాగరిక వాతావరణంలో ఏ పెద్దమనిషీ తన భార్య విషయం మరో స్త్రీ ముందు ప్రస్తావించడట. అయితే ఆ సంగతి సబ్ జడ్జి ఎరగడు. కలెక్టర్ సతీమణి లేచింది,

''మిస్టర్ రామ్, రాత్రి మా యింటికి భోజనానికి'' అంది.

"అయ్యో! చెప్పడం మరిచిపోయాను,'' అంటూ అడ్డు తగిలాడు సబ్ జడ్జి, ''ఆయన మా ఇంటికి భోజనానికొస్తున్నారు. మా ఆవిడ దగ్గరుండి తీసుకు రమ్మంది.''

''ఆయన ఇష్టం. నేను ముందు పిలిచాను'' అని వెళ్ళిపోయింది కలెక్టర్ సతీమణి.

"వారికి కోపం మొచ్చినట్టుంది'' అన్నాడు సబ్ జడ్జి. రామగోపాల్ తనలో తను నవ్వుకున్నాడు.

''మీరు మా ఇంటికి రాగలిగితే సంతోషిస్తాను. సంగతేమిటంటే ఈ వేళ మా ఆవిడ పుట్టినరోజు. మీరు భోజనానికొస్తే చాలా సంతోషిస్తుంది. పోనీ నేను వెళ్ళి కలెక్టర్ సతీమణికి చెప్పి ఒప్పించమన్నారా?'' అన్నాడు సబ్ జడ్జి.

''అబ్బే! అది బాగుండదు'' అని రామగోపాల్ కొంచెం ఆలోచించాడు.

"సంగతేమిటంటేనండి రామగోపాల్ గారూ! మా ఆవిడ మిమ్మల్ని తప్పకుండా తీసుకురమ్మని మరీమరీ చెప్పింది. తను చిన్నప్పుడు మీ శిష్యురాలట. మీరు కాలేజీలో పనిచేసే రోజుల్లో.''

''అల్లాగా!''

రామగోపాల్ సందిగ్ధాన్ని అతని కుతూహలం జయించింది. బహుశా ఆమె ముఖమయినా అతనికి గుర్తుండక పోవచ్చు. అయినా ఆమె ఎవరో చూడాలని గట్టి కోరిక కలిగింది. ఆ రోజుల్లో - అతని కుర్రతనపు రోజుల్లో-అతని అవకతవక గాథ ఆమె అధమం వినిన్నా ఉంటుంది. ఆ తరవాత అతను ఉన్నత పథానికి స్వయంకృషివల్ల ఎగురుతుంటే దూరాన్నించి చూసి ఆశ్చర్యపడి ఉంటుంది. అప్పుడు కాలేజీలో అవమానించబడ్డ రామగోపాలేనా ఇతను అని అనుకుని ఉంటుంది. తన చిన్నతనపు మూర్తికి, ప్రస్తుత మూర్తికి సమన్వయం ఆమె మనసులో ఎలా జరిగి ఉంటుంది? ఆనాటి మూర్ఖుడిని ఈనాటి మేధావితో ఎలా జతపరచగలిగింది ఆమె!

"తప్పకుండా వస్తాను. కలెక్టర్ సతీమణితో నేను సర్ది చెపుతాలెండి,'' అన్నాడు రామగోపాల్.

సబ్ జడ్జిగారింట్లో అడుగు పెట్టేసరికి, అతని కెదురుగా వచ్చి స్వాగతమిచ్చింది రాధ. ఒక్క క్షణంపాటు నోట మాట లేకుండా నిలబడిపోయాడు. వయసులో వచ్చిన మార్పుల వెనక అసలు రాధ అతనెరుగున్న రాధ-అలాగే నిలబడి ఉంది, ఆ చూపుల్లో, ఆ నవ్వులో, ఆ కదలికల్లో.

''రండి మాస్టారూ'' అని అతి సహజంగా, అతి ఆప్యాయంగా ఆహ్వానించింది రాధ. బొమ్మలాగే వెళ్ళి కుర్చీలో కూచున్నాడు రామగోపాల్. ఎదురుగా బల్ల మీద ఆమె పెట్టిన నిమ్మరసాన్ని కాస్త చప్పరించాక కొంచెం తేరుకుని, అప్పుడు పెదవులమీద చిరునవ్వు మొలిపించగలిగాడు. మనస్సు కుదుట పడ్డాక అతను తన చిత్తధైర్యాన్ని తిరిగి తెచ్చు

కున్నాడు. అనంతంగా నడుస్తున్న సంభాషణలో తనుకూడా సరదాగా పాల్గొన్నాడు.

ఆమె తన ఏడుగురు పిల్లల్ని అతనికి చూపించింది. పెద్దమ్మాయికి పెళ్లయింది. పురిటికి పుట్టింటికొచ్చింది. ఆమె పేరు రామ. చిత్రమయిన పేరనుకున్నాడు రామగోపాల్. రెండోవాడు అబ్బాయి. బి. ఏ. పరీక్షకు వెళ్ళాడు. అతని పేరు గోపాల్. రామగోపాల్ మనస్సును ఈ



రెండు పేర్లూ కొంచెం ఆరాటపెట్టాయి. రామ .. గోపాల్. అతను మిగతా పిల్లల పేర్లు వినలేదు.

భోజనాలు చేస్తుండగా సబ్ జడ్జి అమాయకంగా నవ్వుతూ అన్నాడు,

“మీ విషయమంతా మా ఆవిడ చెప్పిందండి. ఆమెమీద వ్యామోహంకొద్దీ మీరు ఉద్యోగానికే నీళ్ళొదులుకున్నారటగా.”

రాధనుగురించి తనకు తెలిసిన విషయాలు భర్తఎదట ఏకరువుపెట్టా లనిపించింది రామగోపాల్ కి-ఒక్కక్షణంపాటు. ఆ అవకాశం ఇవ్వకండానే ఆభర్త అన్నాడు,

"అసలు మీ రింతటివా రవడానికి తనే కారణ మంటుంది మా ఆవిడ. అప్పుడు ఆమె మిమ్మల్ని ఆ విధంగా తృణీకరించక పోతే, మీరు ఈ విధమైన ప్రతిభ ఎన్నటికీ ఆర్జించి ఉండలే రంటుంది."

తాంబూలాలు సేవిస్తుండగా జిల్లా జడ్జిగారివద్దనుంచి సబ్ జడ్జిగారికి కబు రొచ్చింది, ఒక్కసారివచ్చి కలుసుకోమని. సబ్ జడ్జి వెడుతూ రామగోపాల్ ని తను తిరిగివచ్చేవరకూ వెళ్ళిపోవ ద్దని మరీమరీ చెప్పాడు.

పిల్లల్ని నిద్ర పోగొట్టి రాధ వచ్చి అతని ఎదట కూర్చున్నప్పుడు రామగోపాల్ అడిగాడు,

"నీమీద వ్యామోహపడిపోయా నని మీ ఆయనతో ఎందుకు చెప్పావు?"

రాధ అతనివేపు అమాయకంగా చూసింది - అతన్ని దూసుకుపోయి ఆ చూపులు అతని వెనక ఎక్కడో కేంద్రీకరిస్తాయి. చటుక్కుని ఆ కాలేజీ లెక్చరు హాలులో మొదటిసారి ఆ చూపులు తను గుర్తించినప్పటి దృశ్యం రామగోపాల్ మనసులో ప్రత్యక్షమయింది. రాధ అంది,

"అయితే అది నిజంకాదా?"

సుమారు ముప్ఫయి ఏళ్ళ తరవాత రామగోపాల్ మళ్ళీ ఒక స్త్రీ సమక్షంలో తబ్బిబ్బైపోయాడు. జారిపోతున్న చిత్తస్థైర్యాన్ని చిక్కబట్టుకుని తీక్షణంగా అడిగాడు,

"నిజంచెప్పు రాధా! ఆ రాత్రి నువ్వు ఎందు కరిచావు?"

"అబ్బ! నాకెంత భయం వేసిందను కున్నారు, మీ రేంచేసేస్తారో అని?"

"అయితే నన్నెందు కల్లా రెచ్చగొట్టావు?"

"నేనా!....అయ్యో రాత!...... మాస్టారూ! ఆడవాళ్ళని గురించి మీరు రాసే దంతా వట్టి అబద్ధం. అదంతా నిజ మని మీరు నమ్ముతుంటే, మీది పెద్ద పొరబాటు....ఆడవాళ్ళని గురించి మీ కేమీ తెలియదు."

"అలాగా!" అన్నాడు రామగోపాల్ గొంతుకలో కొంటెతనం జతచేర్చి.

రాధ అది గుర్తించనట్లే చెప్పుకు పోయింది. 'నీ సంగతి నాకు తెలుసన్నట్టు' రామగోపాల్ ఆమె వేపు చూస్తూ విన్నాడు.

"పాపం మిమ్మల్ని నేను రెచ్చగొట్టి నట్టు పొరబడ్డారేమో, నాకు తెలియదు. నేను వట్టి వెర్రిదాన్నండి మాస్టారూ! ఇతరులికి నా మాటలూ నా చేతలూ ఎల్లా కనిపిస్తాయో నాకు బొత్తిగా తెలియదు. అదీగాక అప్పుడు నాకు మరీ చిన్నతనం.... ఆ రోజు రాత్రి నేను ఎంత ఏడ్చానో భగవంతుడికే తెలుసు''.

ఆమె ముఖం ఆ దృశ్యాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ పరధ్యానంగా ఉన్నప్పుడు వెనకటి యౌవనమంతా ఆ ముసలి ఆకారం తెర మరుగున ఒక్కసారి గప్పు మని వెలిగి రామగోపాల్ కళ్ళకు మిరుమిట్లు గొలిపింది. మెల్లగా తేరుకుని ఆమె రామగోపాల్ వేపు నవ్వుతూ చూసింది. ఇలా అంది,

"నే నేమని ఆశ పడ్డానో తెలుసా మాస్టారూ! మీ రంత దారుణం చేశాక, మీ మూలంగా నేనంత అల్లరిపడిపోయాక. మీరు మరునాడే మా నాన్నదగ్గర కొచ్చి నన్ను పెళ్ళి చేసుకుంటా నని చెపుతా రను కున్నాను''.

ఆ క్షణంలో రామగోపాల్ అంతరాంతరాల్లో ఏదో చురుక్కున పొడిచింది, పశ్చాత్తాపంలాంటిది. ఆమె చిరునవ్వుతో వెనకటి రోజులు ఒక్కసారిగా ప్రతిఫలించాయి. తా మిద్దరూ అనుభవించి ఉండే సుఖాలను ఆమెకూడా విషాదంగా మననం చేసుకుంటోం దనుకున్నాడు రామగోపాల్. వెనక్కి చూసుకుంటే, అతని జీవితం అరవయిఏళ్ళ ఎడారిలా కనిపించింది. అతని మనస్సు దిగులుతో నిండిపోయింది.

"రాధా! నువ్వు సుఖంగాఉన్నావా?" అని అడిగాడు గద్గదకంఠంతో.

రాధ అతని వేపు కొంటెగా చూసింది. ఆ చూపులో, ఆ చిరునవ్వులో చెప్పరానంత వెటకారం అతనికి గోచరించింది.

"మా ఆయనలాంటి మగవాళ్ళు నూటికి కోటికి ఒకొక్క రుంటారు''అంది, ఆ మాటల్లో, ఆ గొంతులో, ప్రేమేకాదు, ఆరాధన కూడా ప్రతిధ్వనించింది. రామగోపాల్ గుండెలు గొంతుకలో కొట్టుకున్నాయి. అతడు చటుక్కుని లేచి వెళ్ళిపోతుంటే రాధ ఆశ్చర్యపడింది.

బయట చల్లగాలికి మెదడు చల్లబడ్డాక తనలో తను అనుకున్నాడు, నిజంగా ఆడవాళ్ళని గురించి తన కేమీ తెలియ దని. ఇంక ఆడవాళ్ళని గురించి అక్షరం వ్రాయడానికి తనకు అర్హత లేదని నిర్ణయించుకున్నాడు. ★

---

## సినిమా క్విజ్ - జవాబులు

*1. రోజులు మారాయి* — *2. తారుమారు*

*3. గుణసుందరి కథ* — *4. గుండమ్మ కథ*